


# సభల సంరంభం

మన గుంటూర్లో కాంగ్రెసు సభలట - అనే వార్త మా అందర్నీ ఆనందోత్సాహాలతో ముంచెత్తింది.

సభలకోసం నల్లచెరువు పూడ్చి అక్కడ ఏర్పాట్లు చేస్తారనీ, వచ్చే పెద్దలంతా ఉండేందుకు గవర్నమెంటు గెస్టహౌస్‌లు సిద్ధంచేస్తారనీ వార్తలు వచ్చాయి. పెద్ద ఎత్తున సన్నాహాలు మొదలుపెట్టారు.

ఊరంతా పెళ్ళివారిల్లులా ముస్తాబు చేశారు. సభలంటే బంధువులూ మిత్రులూ పదిమంది వస్తారని పనిలోపనిగా చాలామంది వాళ్ళ ఇళ్ళకి కూడా సున్నాలూ రంగులూ వేయించుకున్నారు.

మా ఇల్లు మరీ రోడ్డుమీదే ఉంది. మా డాబామీదకి ఎక్కితేచాలు ఊరేగింపు స్పష్టంగా కనిపిస్తుంది. అందుకని మా మూడోలైనువాళ్ళంతా 'మీ ఇంటికొస్తాం ఆవేళ్టికి' అని ముందే చెప్పి పెట్టుకున్నారు.

సభలు దగ్గరపడినకొద్దీ ఒకటే సందడి. రోడ్డంతా కాంగ్రెసు జండాల తోరణాలు కట్టారు. స్వాగత వచనాలతో బేనర్లు అడుగడుగునా కట్టారు. ఉత్తర భారతదేశంనుంచి ఇనప టోపీ పోలీసులు లారీల నిండా వచ్చి దిగిపోయారు.

అసలు పోలీసులంటేనే చచ్చేంత భయం మాకు. అందులోనూ వాళ్ళు ఇనప టోపీ పోలీసులు. చాలా కఠినంగా వ్యవహరిస్తారుట. రోడ్డు మీద ఊరికే తిరుగుతూ ఉంటే పట్టుకుని జైల్లో పెడతారుట.

మాకేమో తెల్లారిన దగ్గర్నించి సవాలక్షసార్లు రోడ్డుమీదికి వెళ్ళాలి. పోనీ మేం 'ఫలానా'అని చెప్పుకునేందుకేమో మాకు హిందీ రాదు. అప్పటికీ ఓరోజు అంతా వాళ్ళు పిలిచినా అందకుండా 'నహీ నహీ' అని చెప్పి వచ్చేశాం.

మర్నాటికి వాళ్ళతో మాకు స్నేహం కుదిరింది. మా ఇంటి గేటు దగ్గర నిలబడి "బేబీ! పానీ" అని అడిగితే మంచినీళ్ళు ఇచ్చేవాళ్ళం.

మేము ఎంతో ఎదురుచూస్తున్న సభలు వచ్చేశాయి.

పొద్దున తొమ్మిదింటికి రింగురోడ్డు నుంచి నల్లచెరువు సభావేదికకి వెళ్ళాలి ప్రముఖులందరూ. ఏడింటినించే రోడ్డు కిరుపక్కలా చేరిపోయారు జనం.

మాకా బాధలేదు–డాబా మీద నుంచుంటే చాలు.

మా డాబా మీద నవారు మంచాలు వేయించారు. జంబుఖానాలు పరిపించారు. పెద్దవాళ్ళు ఎంతోమంది వచ్చారు మా ఇంటికి. వాళ్ళంతా మంచాలమీద కూర్చున్నారు. మేమందరం పిట్టగోడ దగ్గరే నిలబడ్డాం. ప్రముఖుల రాక మొదలయింది. మంత్రులు, రాజకీయనాయకులు అందరూ ఒకరివెంట ఒకరు కారుల్లో వెళ్తూ జనానికి చేతులూపుతూ ఉంటే జనం కేరింతలు కొడుతున్నారు.

కామరాజ నాడార్, గుల్జారీలాల్ నందా వంటి పెద్దలు...మేము పాఠాల్లో చదువుకునే ప్రముఖులందరూ మన కళ్ళముందు కనబడుతూ ఉంటే దేవతలు కళ్ళెదుట ప్రత్యక్షం అయినట్లు ఉంది మాకు.

కొంతమంది వెళ్ళాక దూరంగా కనిపించింది బంగారం రంగు కారు. ముందూ వెనకా మోటార్‌సైకిళ్ళ మీద సెక్యూరిటీవాళ్ళు. ఆ కారుకి నెంబర్ ప్లేటు ఉండవలసిన

స్థానంలో అశోకచక్రం ఉంది. అందులో నిలబడిఉన్నారు ప్రధానమంత్రి లాల్‌బహదూర్‌శాస్త్రి గారు. వారి పక్కన లలితాశాస్త్రి గారు.

సాక్షాత్తూ మన దేశ ప్రధానిని స్వయంగా చూడడంతో మా ఆనందానికి అంతులేకుండా పోయింది. వినయంగా నమస్కరిస్తూ చెయ్యి ఊపుతూ మా ముందునించీ వెళ్ళిపోయారు ఆయన. జనం అంతా ఆ పారవశ్యంనుంచి బయటపడక ముందే దూరంగా మరో నల్లకారు వస్తూ కనిపించింది.

అందులోని వ్యక్తిని గుర్తుపట్టగానే జనం అందరూ ఒక్కపెట్టున హర్షధ్వానాలు చేశారు.

చాచానెహ్రూ ముద్దుల కుమార్తె ఇందిరాగాంధీ. ఆమెను చూడాలని కెరటంలా విరుచుకుపడ్డారు జనం. వాళ్ళను అదుపుచెయ్యడానికి పోలీసుల తరం కాలేదు. రోడ్డు మీదకి దూసుకొచ్చేశారు.

పోలీసులు లాఠీలకు పనిచెప్పవలసి వచ్చింది. పోతపోసిన బంగారు విగ్రహంలా ఉంది ఆవిడ. ఆ అందం చూడవలసిందేగానీ వర్ణించటం సాధ్యంకాదు. కట్టింది మామూలు ఖద్దరు చీరే అయినా మెరిసిపోతోంది.

అందరూ తనివితీరా చూసేందుకు అవకాశం కల్పిస్తూ చీమలాగా కదిలింది ఆవిడ కారు.

ఢిల్లీనించి వచ్చిన పెద్దలందరూ వెళ్ళాక రాష్ట్రమంత్రులు కూడా ఊరేగింపుగా వెళ్ళారు. అందరూ వెళ్ళిపోయారనడానికి గుర్తుగా వారి వెంట ఉన్న పోలీసు వాహనాలూ వెళ్ళిపోయాయి.

జనం తృప్తిగా వెనుతిరిగారు.

మా ఇంట్లో సందడి కూడా సద్దుమణిగింది. 'మళ్ళీ సాయంత్రం సభల నించి వెనక్కి వచ్చేటప్పుడు మళ్ళీ వస్తాం' అని చెప్పి మరీ వెళ్ళారు.

ఇక సభలు మొదలవగానే మా ఇంట్లో మామ్మల సణుగుడు ప్రారంభం అయ్యింది.

"ఏవిట్రా మరి? మేము చెప్పిన సంగతి ఏం చేశారు? ఈ పూటైనా భోగట్టా కనుక్కుంటారా?" అని కొడుకుల వెంటపడడం.

"మీ చాదస్తం దొంగలుతోలా, చెప్తే అర్థంకాదేం మీకు? అని వీళ్ళు విసుక్కోడం."

విషయం ఏమిటంటే- ఇందిరాగాంధీ తండ్రిపోయాక మొట్టమొదటిసారి గుంటూరు వచ్చిందిట. రాకరాక వచ్చింది. మళ్ళీమళ్ళీ రావడానికి అవకాశం ఉంటుందో ఉండదో. మా ఇంటికి పిలిచి తీపితో భోజనం పెట్టి గుంటూరు జరీ చీరెపెట్టి పంపిస్తారుట.

అది విని మావాళ్ళందరూ పగలబడి నవ్వేశారుట. ఎగతాళి చేశారుట. "ఆవిడేం మామూలు మనిషా ఏవిటి? మనింటికొచ్చి భోజనం చెయ్యడానికి. మన్లాటివాళ్ళకు ఆవిడ దర్శనం లభించడమే దుర్లభం" అన్నారుట.

"ఎంత గొప్పవాళ్ళైతే మాత్రం వాళ్ళకీ బాధలూ బరువులూ ఉంటాయి. మనం పిలవటం మర్యాద. అంత వీలుకాకపోతే ఆవిడే రాదు. అంతేగానీ అసలు పిలవకుండా ఎట్లా?" అని వీళ్ళ వాదన.

ఇంట్లోవాళ్ళతో లాభంలేదని రోడ్డుమీద నిలబడి కనిపించిన ఖద్దరు దుస్తుల కార్యకర్తలతోనూ ఖాకీ దుస్తుల ఇన్‌స్పెక్టర్లతోనూ విషయం వివరించి చెప్పారు. వీళ్ళ సొద భరించలేక 'అట్లాగేలెండి, చెప్పి చూస్తాం' అని మాటిచ్చారు వాళ్ళు.

చూస్తుండగానే సభలు అయిపోయాయి. అందరూ ఎవరిదోవన వాళ్ళు వెళ్ళిపోయారు. 'సభలు ఘనంగా జరిగిపోయాయి' అని అందరూ సంతోషపడ్డారు.

మామ్మలు మాత్రం 'ఇంత ఊరుంది, ఏం లాభం? తండ్రి చచ్చిపోయిన ఆ అమ్మాయిని ఒక్కరంటే ఒక్కరు ఇంటికి పిల్చి ఆదరించలేకపోయారు' అని బాధపడ్డారు.

* * *